# ప్రణయంలో ప్రళయం

అది వంధొమ్మిదివందల డెబ్బైరెండు మార్చి పదహారవ తేదీ!

పనిమనిషి ఉదయం 8-30 గంటలకు బొంబాయిలోని ఒక పెద్ద భవంతిలోని ఒక ఫ్లాట్ తలుపు దబదబ బాదుతోంది. పక్కనే వున్న డోర్ బెల్ నొక్కుతున్నది. ఎంతకీ ఎవరూ తలుపు తియ్యలేదు.

పక్క ఫ్లాట్‌లో నివసించే నయ్యర్ బయటికి వచ్చి, "ఏమిటి" అనడిగాడు. "సీతమ్మగారు తలుపు తెరవడం లేదు" అని సమాధానం చెప్పింది ఆ పని మనిషి. నయ్యర్ వచ్చి తలుపు దబదబ బాదాడు. కాని ఎవరూ తలుపు తెరవలేదు. వెంటనే అతను తన ఇంట్లోకివెళ్లి, పక్క వాళ్ళకి ఫోన్ చేశాడు. గంట మ్రోగుతోంది కాని ఎవరూ ఎత్త లేదు. దాంతో ఆయనకు ఏదైనా జరగరానిది జరిగి వుండవచ్చునని అనుమానం వచ్చింది.

నయ్యర్ తన నౌకర్ని పిల్చి ఫ్లాట్స్ వెనుక వైపుకు తీసుకువెళ్లి, డ్రెయిన్ పైపు ఎక్కి నాలుగో నంబరు ఫ్లాట్ లోపల చూడమని చెప్పాడు. నౌకరు పైపు సహాయంతో నాలుగో నెంబరు కిటికీకి ఎదురుగా వెళ్ళి, కిటికీ అద్దంలో నుంచి లోపలికి చూడడానికి ప్రయత్నించాడు. కాని కర్టెన్స్ వుండటం వలన అతనికి ఏమీ కనిపించలేదు. ఆ పల్చటి కిటికీ కర్టెను అప్పుడప్పుడు పైకెగురుతున్నట్లు గమనించాడు.

ఫ్యాన్ తిరుగుతున్నట్టు అర్థమయింది. మరొకసారి గాలికి కర్టెన్ పైకి లేచింది. ఆ అవకాశం కోసమే జాగ్రత్తగా చూస్తున్న అతనికి లోపల ఒక భయంకర దృశ్యం కనిపించింది. గబగబా కిందికి దిగి వచ్చేశాడు.

అప్పటికే అక్కడ చాలామంది చేరారు. నౌకరు తన యజమాని కేసి చూస్తూ "సాబ్! గదిలో ఒక మగవాడూ, ఒక ఆడదీ. . ." అంటూ ఆగిపోయాడు. అతను నిలువెల్లా వణికిపోతున్నాడు.

నయ్యర్ అతని భుజం మీద చెయ్యి వేస్తూ "ఊఁ చెప్పు" అన్నాడు ఆదుర్దాగా.

"రక్తపు మడుగులో చచ్చి పడున్నారు!" అన్నాడు వణుకుతూ.

అది విని అక్కడున్న వాళ్ళందరూ ఒకరి ముఖం ఒకరు చూడసాగారు. ఎవరికీ మాట రావడం లేదు.

నయ్యర్ వెంటనే తన ఫ్లాట్‌లోకి వెళ్ళి పోలీస్ స్టేషన్‌కి ఫోన్ చేశాడు. ఇన్‌స్పెక్టర్ జయకర్ ఫోన్ తీసుకున్నాడు. నయ్యర్ అతనికి తన పక్క ఫ్లాట్‌లో హత్య జరిగిందనీ, వెంటనే రావలసిందనీ చెప్పాడు.

ఇన్‌స్పెక్టర్ జయకర్, సబ్‌ఇన్‌స్పెక్టర్ దేశపాండే, మరో నలుగురు జవాన్లూ ఆ ప్రదేశానికి చేరుకున్నారు. నయ్యర్ తనకి తెలిసినంతవరకూ విషయాన్ని వివరించి చెప్పాడు. జయకర్ వెంటనే ఫైర్ స్టేషన్‌కి ఫోన్ చేసి "దత్తప్రసాద్ భవన్" కు రావలసిందిగా చెప్పాడు. జయకర్‌కు తలుపు బద్దలు కొట్టడం ఇష్టంలేదు. ఫైర్ బ్రిగేడ్‌కి సంబంధించిన ఒక వ్యక్తిని బ్రెయిన్ పైపు సహాయంతో ఎక్కి ఏదైనా కిటికీ తెరిచి వుందేమో చూడమన్నాడు.

జయకర్ ఆదేశం ప్రకారం సబ్ ఇన్‌స్పెక్టర్ ఫైర్ బ్రిగేడ్‌ను తీసుకుని ఆ భవనం వెనుక వైపుకు వెళ్ళాడు. నయ్యర్‌ని జయకర్ ఆ ఫ్లాట్ యజమాని పేరు అడిగాడు. ఫ్లాట్ నెంబరు నాలుగులో 'శేఖర్' అనే వ్యక్తి వుంటున్నాడనీ, అతని భార్య పేరు 'సవిత' అనీ చెప్పాడు.

డ్రెయిన్ పైపు సహాయంతో గణపతి ఒక కిటికీ దగ్గరకు చేరుకున్నాడు. చేత్తో నెట్టగానే కిటికీ అద్దాల తలుపులు తెరుచుకున్నాయి. కిటికీలోంచి అతను లోపలికి దిగాడు. నగ్నంగా పడి వున్న రెండు మృత దేహాలను చూసి భయంతో ముందు వాకిలి దగ్గరకు పరిగెత్తాడు. తలుపులు తెరిచాడు. తలుపుల దగ్గర ఆనాటి దిన పత్రికలు "టైమ్స్" "మహారాష్ట్ర టైమ్స్" పడి వున్నాయి. వాటిని పక్కకి నెట్టి జయకర్ లోపలికి ప్రవేశించాడు. జయకర్ వెనకే నయ్యర్ కూడా వెళ్ళాడు. అక్కడి దృశ్యం చూడగానే నయ్యర్ రోమాలు నిక్కబొడిచాయి. 'సార్! ఇతను శేఖర్ కాదు!' అన్నాడు వణుకుతున్న కంఠంతో. "ఎవరో చెప్పగలరా?" ప్రశ్నించాడు జయకర్.

"ఇతనెవరో నాకు తెలియదు. నేను ఇతన్ని మొదటిసారి చూస్తున్నాను!" అన్నాడు నయ్యర్.

"ఆ యువతి?" అని ప్రశ్నించాడు జయకర్.

"ఆమె శేఖర్ భార్య. సవిత-"

జయకర్ ఆలోచనలో పడ్డాడు. నొసలు చిట్లించాడు. కనుబొమ్మలు ముడిపడ్డాయి.

"ఇతను శేఖర్ కాదా? అయితే ఎవరై ఉండాలి? ఇలా నగ్నంగా మంచం పక్కగా పడి ఉన్నాడంటే అతను సవిత ప్రేమికుడై వుండాలి!

సవిత భర్త పూనా వెళ్ళాడు. అతని అందమైన భార్య ఒక్కర్తే ఇంట్లో ఉన్నది ....ఆవిడ రాత్రికి తన ప్రియుణ్ణి పిలిపించుకుంది.... దాని ఫలితం ఇది" అలోచిస్తూ జయకర్ శవాల దగ్గరగా వెళ్లి చూశాడు. యువకుడి వీపు మీద చాలా లోతైన గాయం కన్పించింది. అలాంటి గాయమే యువతి పొట్టమీద కన్పించింది. హత్యచేసిన వ్యక్తి చాలా పదునైన ఆయుధాన్ని దేన్నో ఉపయోగించి వుంటాడని అర్థం చేసుకున్నాడు. హత్య దాదాపు పది నుంచి పదకొండు గంటల మధ్యలో జరిగి ఉండాలనుకున్నాడు. ప్రేమికులిద్దరూ వివస్త్రులై ఒకరి ఆలింగనంలో మరొకరు వుండగా తన పని పూర్తిచేసి వుంటాడనుకున్నాడు.

జయకర్ కిటికీలన్నింటినీ పరీక్షించాడు. మూడు కిటికీలలో రెండు బోల్టువేసి వున్నాయి. ఒకటి మాత్రం తెరిచి ఉంది. రెండు కిటికీలు మూసిన సవిత మూడోది ఎందుకు తెరిచి పెడుతుంది. భర్తలేనప్పుడు ప్రియుల్ని ఇంటికి పిల్చుకునే స్త్రీ అంత అజాగ్రత్తగా ఉంటుందా? ఉండడానికి వీలులేదు అనుకున్నాడు. జయకర్ మంచం ప్రక్కన వున్న సోఫామీది వాళ్లిద్దరూ విడిచిన బట్టలు పడి వున్నై. యువకుని పాంటు జేబులు జయకర్ వెతికాడు. ఒక రైల్వే పాసు, కొంత డబ్బు దొరికాయి. పాసు మీద పేరు ''ఎస్. ఎస్. శేఖర్ అని వున్నది. అతని వయసు ముప్పయ్ (30) అని వుంది. అతని రైల్వే పాసు "ఘటకోవర్''నుంచి బొంబాయి ''వి. టి. స్టేషన్'' వరకూ వున్నది. అతని కోటు జేబులో సవిత ఫొటో (పాస్‌పోర్టు సైజుది) దొరికింది. ఫొటోలో సవిత చాలా అందంగా నవ్వుతూ ఉన్నది. చాలా కాలం క్రితం తీసినట్లుంది. మెళ్లో మంగళసూత్రాలు లేవు. పెళ్లికాకముందు తీసిన ఫొటో అని అర్థం చేసుకున్నాడు జయకర్. అంటే వీళ్ళ' పరిచయం పెళ్లికి ముందు నుంచే ఉండివుండాలి. వేలిముద్రలు తీసుకున్నాడు వేలి ముద్రల

నిపుణుడు. అంతలో బయట నుంచి ఎవరో వెక్కి వెక్కి ఏడుస్తున్నట్టు వినిపించింది జయకర్‌కి. వెంటనే జయకర్ డ్రాయింగ్ రూంలోకి వచ్చాడు. అక్కడ ఒక యువకుడు వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు. అతను ఆరోగ్యం గాను చాలా అందంగాను వున్నాడు. అతను సవిత భర్తే అయివుండాలని జయకర్ ఊహించాడు.

నయ్యర్‌ని "ఎవరితను?" అడిగాడు. "సవిత భర్త" అని చెప్పాడు నయ్యర్. అతను అప్పుడే పూనా నుంచి వచ్చాడనీ, ఇంటి ముందు గుంపును చూసి స్థంభించిపోయాడనీ, తనభార్య హత్య చేయ బడిందని తెలిసి, నిండుకుండ బ్రద్దలైనట్లు భోరున ఏడుస్తున్నాడనీ, చెప్పాడు నయ్యర్.

జయకర్ కూడా శేఖర్ భుజం తడుతూ ధైర్యం చెప్పాడు. "జరిగిందేదో జరిగింది. బాధపడి లాభంలేదు. హంతకుణ్ణి తప్పకుండా పట్టుకుంటాము. అందుకు మీ సహాయం చాలా అవసరం" అన్నాడు జయకర్.

శేఖర్ తలెత్తి జయకర్ ముఖంలోకి చూశాడు. ఎంత ఆపుకోవా లన్నా దుఃఖం అగటంలేదు. రుమాలు తీసుకుని ముఖం తుడుచుకున్నాడు.

"మీరు ధైర్యంగా వుండాలి. సవితతో పాటు చనిపోయిన ఆ యువకుడెవరో చెప్పగలరా?" అడిగాడు ఇన్‌స్పెక్టరు.

శేఖర్ లేచి నిల్చున్నాడు. నిలబడలేనట్టే మళ్ళీ కుర్చీలో కూల బడ్డాడు. రెండు చేతుల్తో ముఖం కప్పుకుని ఏడవ సాగాడు. ఇన్‌స్పెక్టర్ అతనికి ధైర్యంచెబుతూ అతన్ని లేవదీసిలోపలికి నడిపించుకు పోయాడు. అక్కడి దృశ్యం చూసి, భయవిహ్వలుడై జయకర్ చేతిని గట్టిగా పట్టు కున్నాడు శేఖర్.

"వాడు!.... వాడెవడో నాకు తెలియదు!'' వెక్కిళ్ళ మధ్య జవాబిచ్చాడు శేఖర్.

ఇన్‌స్పెక్టర్ అతన్ని పట్టుకుని డ్రాయింగ్ రూంలోకితీసుకొచ్చాడు. శేఖర్‌ను ప్రశ్నించి ముఖ్యమైన విషయాలు తెలుసుకున్నాడు.

శేఖర్ పోర్టుకి సంబంధించిన ఒక పెద్ద కంపెనీలో క్లాస్ వన్ ఆఫీసరుగా పని చేస్తున్నాడు. కంపెనీ పనిమీద తరుచుగా బయటి ఊళ్ళకి వెళ్తూ వుంటాడు. తను వుంటున్న ఫ్లాట్ కంపెనీ పేరుమీదే వుంది. టెలిఫోన్ కూడా కంపెనీవారిదే! కొద్ది నెలల క్రితమే ఈ ఫ్లాట్‌లోకి వచ్చాడు. అంతకుముందు తల్లి దగ్గర ఘటకోవర్లో వుండేవాడు. వారి వివాహం ప్రేమ వివాహం. సవిత కూడా ఘటకోవర్లో ఉండేది. పెళ్లయ్యాక కొన్ని రోజులు వాళ్ళిద్దరూ గ్వాలియాటేక్‌లో వున్నారు.

సవిత కూడా పోర్టుకి సంబంధించిన ఒక ఫర్మ్‌లో పనిచేస్తూ ఉండేది. రోజూ ఉదయం ఇద్దరు కలిసే ఆఫీసుకు బయలుదేరేవారు. సాధారణంగా మధ్యాహ్నం ఇద్దరూ కలిసి ఏ హెూటల్లోనో లంచ్ చేసే వారు. మొత్తం మీద రోజులు చాలా సంతోషంగా గడిచిపోయినై. ఇద్దరూ ఒకరినొకరు చాలా ప్రేమించుకునే వారు. సవిత మరో పురుషుడితో ఇలాంటి సంబంధం పెట్టుకోగలదని తను కలలో కూడా ఊహించలేదని చెప్పాడు శేఖర్.

శేఖర్ చెప్పినదంతా శాంతంగా విన్నాడు ఇనస్పెక్టర్ జయకర్.

చనిపోయిన యువకుని జేబులో దొరికిన రైల్వే పాస్ ప్రకారం అతనూ ఘటకోపర్‌లోనే ఉంటున్నాడనేది నిర్వివాదాంశం. అందుకే శేఖర్నుద్దేశించి, ''గుర్తుచేసుకో! నువ్వు బహుశా చనిపోయిన యువకుణ్ణి చూసే వుంటావు!'' అన్నాడు.

''లేదు! నేనతన్ని ఎప్పుడూ చూడలేదు" శేఖర్ తడుముకోకుండా జవాబిచ్చాడు.

పదకొండవ తారీఖు కంపెనీ పనిమీద పూనా వెళ్ళాననీ, యిరవై రోజులుండవలసిన తను పని పూర్తి అయిపోయినందున త్వరగా వచ్చేశానని చెప్పాడు శేఖర్.

లాక్ కీని చూపిస్తూ "రెండో ''కీ'' ఎవరి దగ్గరుంటుంది?" అని ప్రశ్నించాడు ఇనస్పెక్టర్.

"నా దగ్గర!'' ''ఇంకెవరి దగ్గరైనా వుంటుందా?" జయకర్ ప్రశ్న.

'లేదు!' సమాధానం.

"ఇవాళ ఏ బండిలో వచ్చారు?''

"దక్కన్ క్వీన్'' అన్నాడు.

''ఎన్ని గంటలకు వచ్చింది?''

''పదిన్నరకు! తిన్నగా బండి దిగి ఇక్కడికే వచ్చాను!''

''బండిలో చాలా రద్దీగా వుందా?''

ఓక్షణం ఆలోచించి ''రద్దీ మామూలుగా ఉంటూనే వుంటుంది. నేను ఫస్ట్‌క్లాసులో వచ్చాను''

''ఫస్ట్ క్లాసులో ప్రయాణం చేసినప్పుడల్లా రసీదు తీసుకుంటారు కదూ! ఇవాళ తీసుకున్నారా?"

''పదిహేను రూపాయలకు రసీదెందుకని ఇవాళ తీసుకోలేదు!"

"మీరు పోలీసు స్టేషన్‌కు రావాలి. మీ రిపోర్టు తీసుకుని మిమ్మల్ని పంపిచేస్తాను!" అంటూ జయకర్ లేచాడు.

ఇన్‌స్పెక్టర్‌తో శేఖర్ ఎలాంటి తత్తరపాటూ లేకుండావే బయల్దేరాడు. అతన్ని పోలీసు స్టేషన్లో కూర్చోబెట్టి జయకర్ ఇద్దరు సిపాయిల్ని కావలా పెట్టి, "ఇప్పుడేవస్తాను!" అంటూ బయటికి వెళ్ళిపోయాడు.

వి. టి. స్టేషనుకి వెళ్ళి. స్టేషను మాస్టరు దగ్గర ఫస్ట్ క్లాస్ ఛార్టు తీసుకున్నాడు. లిస్టులో శేఖర్ పేరులేదు. అక్రితం రోజు (15 మార్చి) లిస్టు తీసుకున్నాడు. అందులో శేఖర్ పేరున్నది. జయకర్ పెదవుల మీద చిరునవ్వు లీలా మాత్రంగా కదిలింది.

"ఈరోజు దక్కన్ క్వీన్ ఎన్ని గంటలకు వచ్చింది?" అని స్టేషన్ మాస్టరును అడిగాడు.

'పన్నెండు గంటల పదిహేను నిముషాలకు వచ్చింది' అని స్టేషను మాస్టరు సమాధానం ఇచ్చారు.

"నిన్న ఎన్ని గంటలకు వచ్చింది?"

"నిన్న కరెక్ట్ టైమ్‌కే - అంటే పదిన్నరకే వచ్చింది"

జయకర్ ఆరోచనలో పడ్డాడు. "అంటే శేఖర్ నిన్ననే వచ్చాడు. పగలంతా ఎక్కడ ఉన్నాడు...."

హంతకుడు ఇంత తేలిగ్గా దొరుకుతాడని తను ఊహించలేదు. కాని హంతకుడే తన దగ్గరకు వచ్చాడు. ఇన్‌స్పెక్టర్ పోలీసు స్టేషన్‌కు తిరిగివచ్చాడు.

శేఖర్ ప్రశాంతంగా సిగరెట్ తాగుతున్నాడు. జయకర్ మర్యాదగా శేఖర్‌తో నిజం చెప్పించాలని నిశ్చయించుకున్నాడు. శేఖర్ని ఆపాదమస్తకం ఒకసారి తీవ్రంగా చూశాడు.

"శేఖర్! నేనడిగిన ప్రశ్నలకు సరైన సమాధానాలు చెప్పాలి! నేను వి. టి. స్టేషనుకి వెళ్లివచ్చాను. నువ్వు చెప్పినట్టు ఇవాళ బండి వదిన్నరకు రాలేదు. పన్నెండూ పది నిముషాలకు వచ్చింది. నువ్వివ్వాళ ప్రయాణం కూడా చెయ్యలేదు. నిన్నటి నుంచీ ఇప్పటి వరకూ నువ్వెక్కడవున్నావు?"

"సార్! సార్! నాకూ ఈ హత్యకు సంబంధం వుందని అనుమానిస్తున్నారా?'' వణుకుతూ శేఖర్ అడిగాడు.

"నేనా మాట అనలేదే! నిన్నంతా ఎక్కడ వున్నావని అడుగుతున్నాను?''

''నేను నిర్దోషిని.''

"నోరుముయ్!" ''శేఖర్ నీమీద చెయ్యి చేసుకోవడం నాకిష్టం లేదు! తిన్నగా సరియైన సమాధానం చెప్పు!''

శేఖర్ నోటివెంట మాట రావటంలేదు. తెల్లముఖం వేసి చూస్తూ నిలబడ్డాడు.

''నీదంతా దొంగ ఏడుపేనని అప్పుడే అర్థం చేసుకున్నాను. నువ్వు అబద్ధాలుచెప్పి తప్పించుకోలేవు. ''

"సార్! సార్! నేనీహత్య చెయ్యలేదు!"

జయకర్ చేతిలో వున్న లాఠీని పైకి ఎత్తుతూ. ''నీ కుడి పాదం చూపించు!" అంటూ గర్జించాడు.

శేఖర్ వెంటనే చెప్పులోనుంచి కాలు బయటికి తీసి చూపించాడు. పాదంపైన ఎండిపోయిన రక్తం మరకలు కనిపించాయి.

ఆ రక్తం మరకలేమిటి?

శేఖర్ ఒక్కక్షణం బిత్తరపోయాడు. మరుక్షణం ''మీరా కర్ర అవతల పెట్టండి! కొంచెం సేపు నన్ను ఏమీ అడక్కండి!'' అన్నాడు కృంగిపోతూ.

'అలాగే!' అంటూ జయకర్ లాఠీని టేబుల్ మీద పెట్టి శేఖర్‌ని చూస్తూ కూర్చున్నాడు. ఐదు నిమిషాలు తర్వాత శేఖర్ ముఖంలో ప్రశాంతత కన్పించింది.

"నేనే ఈ హత్యలు చేశానని ఒప్పుకుంటున్నాను" అన్నాడు.

''అయితే వివరంగా చెప్పు! ఇంత క్రూరంగా ఎందుకు ప్రవర్తించావు?''

ఆ చనిపోయిన యువకుడునాకు తెలుసు.... పేరు నరేశ్. సవితకు పాత స్నేహితుడు.... అంటూ తానెందుకు హత్య చేశాడో చెప్పాడు. ఆవివరణ సారాంశం:-

సవిత నడవడి మంచిదికాదు. ఆ సంగతి వివాహానికి ముందే శేఖర్‌కు తెలుసు. అయినా ఆమె సౌందర్యానికి ముగ్ధుడై ఆమెను వివాహం చేసుకున్నాడు. పెళ్ళి అయ్యాక ఆమె నడవడిలో మార్పు వస్తుందని ఆశించాడు. కాని అతని ఆశ అడియాసే అయింది. శేఖర్ ఆమెకు ఎన్నో విధాల చెప్పి చూశాడు. ప్రతిసారీతను తప్పుగా ప్రవర్తించలేదనీ, శేఖర్ తనని అనవసరంగా అనుమానిస్తున్నాడనీ సవిత ఆరోపించింది. తాను ఆఫీసు పనిమీద టూరు వెళ్ళినప్పుడు నరేశ్ రాత్రిళ్ళు ఇంటికి

వస్తాడని శేఖర్‌కు తెలిసింది. తన భార్యకు చెప్పి చెప్పి విసిగిపోయిన శేఖర్ ప్రత్యక్షంగా పట్టుకుని, వాళ్లను దోషులుగా నిరూపించాలని నిశ్చయించుకున్నాడు. అందుకే అతను 20 మార్చి వరకూ తిరిగి రానని చెప్పి పూనా వెళ్ళాడు. చెప్పిన తేదీకి ముందే మార్చి పదిహేను ఉదయం దక్కన్ క్వీన్‌లో వచ్చి దిగాడు. స్టేషన్ దగ్గర్లో వున్న హొటల్లో ఒక గది తీసుకున్నాడు. చీకటి పడుతుండగా ఒక దుకాణంలో గండ్రగొడ్డలి కొన్నాడు. రాత్రి దాదాపు ఎనిమిది గంటలప్పుడు ఎవరూ చూడకుండా తన దగ్గరున్న డూప్లికేట్ సహాయంతో లాక్‌ని తెరిచి లోపలికి ప్రవేశించాడు. అప్పటికి సవిత ఇంటికి రాలేదు. తను స్టోర్ రూంలో దాక్కున్నాడు.

రాత్రి దాదాపు తొమ్మిది గంటలకు సవిత నరేశ్‌ను వెంటబెట్టుకొని వచ్చింది. ఇద్దరూ కబుర్లు చెప్పుకుంటూ నవ్వుకుంటూ భోజనాలు చేశారు. స్టోర్ రూంలో దాక్కున్న శేఖర్ రక్తం కుతకుతలాడసాగింది. తలలో నరాలు చిట్లడానికి సిద్ధంగా ఉన్నట్టు అనిపించింది. భోజనాలు పూర్తి చేసి కొంత సేపు కబుర్లు చెప్పుకున్నారు. ఆ కబుర్లలో శేఖర్ పేరు కూడా వచ్చింది. ఆ తరవాత ఇద్దరూ వెళ్ళి ఒకే మంచం మీద పడుకున్నారు...

''సార్! ఏ మగవాడు ఇటువంటి అవమానాన్ని భరించగలడో చెప్పండి!" అన్నాడు శేఖర్. అతని కంఠంలో దుఃఖం గరగర లాడింది.

"నీ మానసిక స్థితి నేను అర్థం చేసుకోగలను. ఆ తరవాత ఏం జరిగిందో చెప్పు!" అన్నాడు జయకర్.

"ఆతర్వాత....సార్!" గొంతు ఎండి పోయినట్లు ఓక్షణం అగి "ఇద్దరూ బట్టలు విప్పేశారు. అంతా నా కళ్ళతో చూస్తూ ఉన్నాను." అని తలవంచుకున్నాడు.

దాదాపు పిచ్చివాణ్ణే అయ్యాను. నా బట్టలు విప్పి, గొడ్డలి తీసుకుని తిన్నగా ముందుకు వచ్చాను. వాళ్ళిద్దరూ ఆలింగనంలో మైమరచి పోయి నన్ను అసలు గమనించలేదు. గండ్రగొడ్డలి పెట్టి నరేశ్ వీపు మీద గట్టిగా కొట్టాను. ఎగిరి మంచం పక్కన పడిపోయాడు. నోటివెంట శబ్దం కూడా రాలేదు. ఏం జరిగిందో తెలుసుకునే లోపలే నా గండ్ర గొడ్డలి సవిత పొట్టలోకి దిగిపోయింది. రక్తసిక్తమైన గొడ్డల్ని వంటయింట్లో దాచాను. బాత్ రూంలోకి వెళ్ళి కాళ్ళూ చేతులు కడుక్కున్నాను. ఆ తరువాత దుస్తులు వేసుకుని బెడ్‌రూంలోని ఒక కిటికీ తెరచి డ్రెయిన్ పైపు సహాయంతో క్రిందికి దిగాను. రోడ్‌మీదకు వచ్చి ఒక టాక్సీలో హొటల్‌కి వెళ్ళిపోయాను" శేఖర్ రెండు చేతుల్తో ముఖం కప్పుకున్నాడు.

అతని కథ విన్న జయకర్ కళ్ళు చెమ్మగిల్లాయి. అయినా అతను చేయగలిగింది ఏమీలేదు.

చాలా కాలం కోర్టులో కేసు నడిచింది. అతనికి ఆజన్మ కారాగార శిక్ష విధించడం జరిగింది. న్యాయమూర్తి తన నిర్ణయాన్ని వినిపించగానే "నో! నో! నాకు ఉరిశిక్ష వేయండి! జన్మంతా ఆ భయంకర జీవితాన్ని గడపలేను. నాకు ఉరిశిక్ష ప్రసాదించండి!" అంటూ శేఖర్ పిచ్చివాడిలా అరవసాగాడు.

పోలీసులు అతన్ని బయటికి తీసుకెళ్ళిపోయారు. ఇన్‌స్పెక్టర్ జయకర్ కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. జేబురుమాల్తో కళ్ళు తుడుచుకుంటూ కోర్టు బయటికి వెళ్లిపోయాడు.